క్లుప్తంగా

కురబలకోట తహసీల్దారుగా ఈశ్వరమ్మ



కురబలకోట: కురబలకోట నూతన తహసీల్దారుగా ఈశ్వరమ్మ నియమితులయ్యారు. ఇక్కడి తహసీల్దారు ఎం.భీమేశ్వర రావు ఎన్నికల బదిలీలలో భాగంగా వైఎస్సార్ కడప జిల్లా సింహాద్రిపురంకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అనంతపురం జిల్లా శింగనమల తహసీల్దారు ఈశ్వరమ్మను ఇక్కడికి బదిలీ చేశారు. సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు.

పర్యాటకుల భద్రతకు ప్రాధాన్యత

– మదనపల్లె డీఎస్పీ కే.కేశప్ప

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు వచ్చే పర్యాటకులకు భద్రతకు ప్రాధాన్యమిచ్చి చర్యలు తీసుకుంటున్నామని మదనపల్లె డీఎస్పీ కే.కేశప్ప అన్నారు. కొండపై గాలిబండ వద్ద నిర్మించిన పర్యాటక ఔట్‌పోస్టు కేంద్రాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటకుల భద్రత, వారికి అవసరమైన సమాచారం ఇచ్చేందుకు వీలుగా ప్రభుత్వం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఇక్కడ నిత్యం పోలీసులు విధుల్లో ఉంటారని, పర్యాటకులకు అవసరమైన సమాచారం ఇవ్వడం, భద్రత కల్పించడం జరుగుతుందన్నారు. ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

నిమ్మనపల్లె : పేకాట స్థావరం పై దాడులు నిర్వహించి ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ లోకేష్ రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని తవళం పంచాయతీ చౌకిళ్లవారిపల్లి సమీపంలో కొంతమంది పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు చెప్పారు. ఈ దాడిలో చౌకిళ్ళ వారి పల్లెకు చెందిన బోదాల కిరణ్ కుమార్ (32), పెద్దారెడ్డి వెంకటరమణారెడ్డి (35), గోదాల రాజశేఖర్ (27), షేక్ సయ్యద్ బాషా (36), చింతమాను గురుమూర్తి (47) అను ఐదుగురిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.2,720 నగదు స్వాధీనం చేసుకున్నమన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

బి.కొత్తకోట: మండల సరిహద్దులోని కర్ణాటక నుంచి బైక్‌పై అక్రమంగా మద్యం తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు మదనపల్లె సెబ్ సీఐ రమేష్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వివరాలిలా.. బి.కొత్తకోట సమీపంలోని డేగానిపల్లెకు చెందిన సి.లక్ష్మీదేవి, ఎం.సుబ్బరాయుడు, ఎం.శ్రీనివాసులు బైక్‌పై సరిహద్దు చెక్‌పోస్టుకు సమీపంలోని మద్యం దుకాణంలో కర్ణాటక మద్యం కొనుగోలు చేశారు. వాటిని బైక్‌పై ఉంచుకుని సరిహద్దు దాటి వస్తుండగా నిర్వహించిన తనిఖీల్లో నిందితులు పట్టుబడినట్టు తెలిపారు. 180 ఎంఎల్ బాటిళ్లు 46, 90 ఎంఎల్ ప్యాకెట్లు 192, బైక్‌ను స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశామని సెబ్ సీఐ రమేష్‌రెడ్డి తెలిపారు.

సారా విక్రేత అరెస్ట్

బి.కొత్తకోట: సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి, వాటిని సరఫరా చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని సెబ్ సీఐ రమేష్‌రెడ్డి ఆదివారం తెలిపారు. కురబలకోట మండలం ఎనుములవారిపల్లె క్రాస్‌లో ఎస్.చిన్నరెడ్డెప్ప సారా విక్రయిస్తుండగా దాడిచేసి 8 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితున్ని అరెస్ట్ చేసామని, ఇతనికి సారా సరఫరా చేస్తున్న తంబళ్లపల్లె మండలం కొటకొండతండాకు చెందిన ఎం.శంకర్‌నాయక్ పైనా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మొదటి జీతంతో 280 మందికి అన్నదానం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్‌లో సభ్యుడిగా ఉన్న నరేష్‌కు కొత్తగా ఉద్యోగం వచ్చింది. దీంతో మొదటి నెల జీతం అందుకున్న అతడు ఆదివారం హొస్‌కోట సమీపంలోని విద్యారణ్య ఆశ్రయంలో ఉన్న 280 మందికి ఒక పూట భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్,సభ్యులు నరేష్, మునిరాజ్, ప్రవీణ్, మహేంద్ర, శూనూ, రెడ్డెప్ప, అనిల్ పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌సీ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా పీర్‌బాషా



వాల్మీకిపురం: జాతీయ మానవ హక్కుల కమీషన్ సౌత్ ఇండియా బోర్డు ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా వాల్మీకిపురం పట్టణంకు చెందిన పీర్‌బాషాను ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సేవను గుర్తించి తనకు ఈ పదవిని ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. హక్కుల రక్షణ కోసం మరింత కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో అదనపు బాధ్యతలు అప్పగించిన హెచ్‌ఆర్‌సి బోర్డుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ ప్రముఖులు, నాయకులు, సంస్థ సభ్యులు పీర్‌బాషాను అభినందించారు.

అభివృద్ధి చేశాం..ఓట్లడుగుతాం

- ప్రతిగడపకు సంక్షేమం అందించిన ప్రభుత్వమిది
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



రెడ్డెప్పను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట: తంబళ్లపల్లె నియోజకవర్గ చరిత్రలో జరగని అభివృద్ధి చేశాం..ప్రజల్లోకి వెళ్లి ధైర్యంగా ఓట్లడుగుతాం అని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. ఆదివారం బి.కొత్తకోటలో జరిగిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన పలువురిని పరామర్శించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నాయకులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 2019 నుంచి ఇప్పటివరకు నియోజకవర్గంలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.388.03 కోట్లతో 665.145 కిలోమీటర్ల మేర ఉన్న 355 మట్టి రోడ్లను తారురోడ్డుగా నిర్మాణం చేశామన్నారు. ఆర్ అండ్‌బీ ద్వారా రూ.100.74కోట్లు మంజూరు చేయగా 67 కిలోమీటర్ల రహదారుల అభివృద్ధి, కొత్త రహదారుల నిర్మాణాలు జరిగాయన్నారు. తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండపై వెలసిన మల్లికార్జునస్వామి ఆలయజీర్ణోద్ధరణకు రూ.3.15 కోట్లతో పనులు చేపట్టామన్నారు. మల్లయ్యకొండకు రూ.6.75 కోట్లతో తారురోడ్డు నిర్మాణం జరిగిందన్నారు. తంబళ్లపల్లె, బి.కొత్తకోట వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రుల్లో రూ.6.53 కోట్లతో ఆక్సిజన్ ప్లాంట్లు, మౌలిక వసతులు కల్పించామన్నారు.

ఇంటింటికీ కొళాయి కనెక్షన్లు

గడప గడపకు మన ప్రభుత్వం, ఉపాధి హామీ పథకం ద్వారా రూ.26.16 కోట్ల మురుగు నీటి కాలువలు, సిసిరోడ్లు, ఇతరా అభివృద్ధి పనులు జరుగుతున్నట్టు చెప్పారు. జల్‌జీవన్ మిషన్-ఏపీ ప్రభుత్వ నిధులు రూ.17.10 కోట్లతో ఇంటింటికి కొళాయి ఏర్పాటు చేశామని, రూ.500 కోట్లతో త్వరలో వాటర్‌గ్రిడ్ పనులు ప్రారంభం అవుతాయన్నారు. రైతుల సంక్షేమం కోసం కురబలకోట మండలం ముదివేడు వద్ద రూ.775 కోట్లతో రిజర్వాయర్ నిర్మాణం చేపట్టగా ఎన్‌జీటీ తీర్పుతో పనులు ఆగాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు మంచి చేయాలన్న చర్యలను ప్రతిపక్షాలు కుట్రలతో అడ్డుపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వాయర్లు, చెరువులకు కృష్ణా జలాలు అందించేలా హంద్రీనీవా ప్రాజెక్టు రెండోదశకు చెందిన పుంగనూరు ఉపకాలువ విస్తరణకు రూ.1,219 కోట్లతో కాంట్రాక్టర్‌తో పనులు చేపట్టేందుకు ఒప్పందం జరిగిందని త్వరలో పనులు ప్రారంభం అవుతాయని చెప్పారు.

రూ.5 కోట్లతో చింతపండు ప్రాసెసింగ్ యూనిట్ :

కురబలకోటలో రూ.5 కోట్లతో చింతపండు ప్రాసెసింగ్ యూనిట్, బి.కొత్తకోట మండలం గుంతావారి పల్లెలో, ములకలచెరువుల్లో రూ.10.10 కోట్లతో టమాట ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు చేశామన్నారు. ఇవికాక రూ.2 కోట్లతో ఆలయాల అభివృద్ధి చేయగా, ప్రభుత్వ సేవలను రైతులు, ప్రజల ముంగిటకే తీసుకొస్తూ రూ.31.50 కోట్లతో 72 సచివాలయాల భవనాలు, రూ.15.8 కోట్లతో 66 రైతుభరోసా కేంద్రం భవనాల నిర్మాణం చేశామన్నారు. నియోజకవర్గంలో రూ.7.28 కోట్లతో హెల్త్ సెంటర్ల నిర్మాణం, రూ.35 లక్షలతో నాలుగు పాలశీతలీకరణ కేంద్రాల ఏర్పాటు చేశామన్నారు.

పరామర్శ

ప్రమాదంలో గాయపడిన మద్దేపల్లి రెడ్డెప్పను ఎమ్మెల్యే పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్, మండల అధ్యక్షులు ఎన్.ప్రదీప్‌రెడ్డి, మాజీ కన్వీనర్ జాఫర్‌బాషా, జాబీర్, అభిలాష్‌రెడ్డి, సాయి, సర్పంచులు నాగిరెడ్డి, గిరిజ రఘునాథరెడ్డి, వెంకటరమణ, చంద్ర, సాంబశివ, ఎంపీటీసీ రామసుబ్బారెడ్డి, నగినా పాల్గొన్నారు.

షాదీమహల్ షాపింగ్ కాంప్లెక్స్ అద్దెలివిగో..!

- టీడీపీ పాలనలో వసూళ్లు లెక్కలు తేల్చండి
- వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ వసీమ్‌అక్రమ్



షాపింగ్‌కాంప్లెక్స్ గదుల వసూళ్ల వివరాలు చూపిస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ వసీమ్‌అక్రమ్

మదనపల్లె : ఇందిరానగర్ మసీదు కమిటీ పెద్దలు, షాదీమహల్ కమిటీ సభ్యుల ఆదేశాల ప్రకారం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో, స్థానిక కౌన్సిలర్‌గా తాను వసూలు చేసిన షాపింగ్‌కాంప్లెక్స్ అద్దెలకు సంబంధించి, ప్రతి రూపాయికి లెక్కలు ఉన్నాయి. టీడీపీ పాలనలో చేసిన వసూళ్లకు లెక్కలు తేల్చాలంటూ వైఎస్సార్ సీపీ 28వవార్డు కౌన్సిలర్ వసీమ్‌అక్రమ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఇందిరానగర్‌లోని షాదీమహల్ కాంప్లెక్స్ వద్ద, టీడీపీ మైనారిటీ నాయకులు ఎస్.ఏ.మస్తాన్ తనపై చేసిన ఆరోపణలకు సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు మస్తాన్ వాస్తవాలు తెలుసుకోకుండా, గుమ్మడికాయ దొంగ అంటే భుజాలు తడుముకున్న చందాన ఆయన గోతిని ఆయనే తవ్వుకున్నారన్నారు. గతంలో ఆయన, అతడికి వరుసకు అన్న అయిన ఎం.డి.రఫీ షాదీమహల్ అద్దెల విషయంలో పాల్పడ్డ అవినీతిపై కమిటీ పెద్దల నిర్ణయం, సలహా మేరకే 2021 ఆగస్టు 31న షాప్‌రూమ్‌లకు బహిరంగ వేలం పాటలు నిర్వహించామన్నారు. 1997లో 12మందితో షాదీమహల్ నిర్మాణకమిటీని ఏర్పాటు చేసి సాహెబ్‌పీరాను అధ్యక్షుడిగా, తర్వాత ఎస్.ఏ. మస్తాన్ అన్న అయిన ఎం.డి.రఫీని అధ్యక్షులుగా నియమించారన్నారు. షాదీమహల్ షాపింగ్ కాంప్లెక్స్ 2013లో నిర్మించి, 2014లో అసెస్‌మెంట్ నెంబర్ కేటాయించడం జరిగిందన్నారు. 2014-2021 వరకు వసూలుచేసిన అద్దెలు ఏమయ్యాయో తేల్చాల్సిన బాధ్యత ఎస్.ఏ.మస్తాన్‌పై ఉందన్నారు. 2018, మార్చి28న రూ.62,600 మాత్రమే పన్ను చెల్లించారని, ఎనిమిదేళ్ల వసూలుచేసిన అద్దెలు ఇంతేనా అని ప్రశ్నించారు. షాదీమహల్ కమిటీ అధ్యక్షుడిగా తానేమో చేసేశానని, గొప్పలు చెప్పుకుంటున్న ఎస్.ఏ.మస్తాన్ ఇందిరానగర్‌కు డబ్బులు దండుకునేందుకు తప్ప మరెప్పుడూ రాలేదన్నారు. జామియా మసీదులో శుక్రవారం జోలెపట్టి చందాల రూపంలో వసూలుచేసిన డబ్బులు ఏమిచేశారో.. మస్తాన్ సమాధానం చెప్పాలన్నారు. 2021లో తాను షాపింగ్ కాంప్లెక్స్ బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచీ ఇప్పటివరకు 6 రూములకు అడ్వాన్సు, బాడుగల రూపంలో వసూలుచేసిన మొత్తం రూ.4,90,000 చూపిస్తున్నానని, మీరు వసూలుచేసిన డబ్బులు చూపించగలరా అని ప్రశ్నించారు. అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలి. ఎస్.ఏ.మస్తాన్ స్థాయికి, వయస్సుకు తగదని హితవుపలికారు. కార్యక్రమంలో మహబూబ్‌బాషా, బబ్లూ, సాహెబ్‌పీర్, అక్బర్, నూర్‌ఆజం తదితరులు పాల్గొన్నారు.

వెలుగు స్కూల్‌కు హెల్పింగ్ హ్యాండ్స్ వితరణ

కురబలకోట: మదనపల్లె అమ్మచెరువు మిట్ట వద్ద నున్న మానసిక వికలాంగుల వెలుగు స్కూల్‌లో అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎంసీఏ మొదటి సంవత్సరం విద్యార్థులు హెల్పింగ్ హ్యాండ్స్ కార్యక్రమం కింద ఆదివారం రూ.18,650 విలువ చేసే వస్తువులు, సరుకులు అందజేశారు. బియ్యం బస్తాలు, నోటు పుస్తకాలు, ఆట బొమ్మలు, పెన్నులు, స్టడీ మెటీరియల్ మొదలైన వాటిని అందించారు. హెచ్‌ఓడీ నవీన్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ మరదముత్తు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

మదనపల్లె సిటీ: స్థానిక సీటీఎం రోడ్డులోని శాఖ గ్రంథాలయంలో ఆదివారం చదవడం మా కిష్టం కార్యక్రమంలో భాగంగా పాఠకుడు నందకిషోర్ విద్యార్థులకు విద్యాసామగ్రిని ఉచితంగా అందజేశారు. జామెంట్రీ బాక్సులు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ప్రముఖ సైకియాట్రిస్టు డాక్టర్ రాధిక మాట్లాడుతూ గ్రంథాలయానికి వచ్చే విద్యార్థులకు ఉచితంగా విద్యాసామాగ్రి అందజేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయంకు వచ్చి పుస్తకాలు చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో బి.కొత్తకోట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్,గ్రంథలయాధికారి వసంత, ప్రముఖ రచయిత టీ.ఎస్.ఏ.క్రిష్ణమూర్తి, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జేవీవీ అధ్యక్షుడు ప్రభుచరణ్

వాల్మీకిపురం: ప్రతి ఒక్కరూ కేన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుచరణ్ అన్నారు. ఆదివారం స్థానిక తరిగొండ రోడ్డులోని మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు కేన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక మరణాలకు కారణం అవుతున్న వ్యాధుల్లో కేన్సర్ కూడా ఒకటని, మన జీవనశైలి, పొగతాగడం, మద్యపానం, గుట్కా వంటి అలవాట్లుకు దూరంగా ఉండటం మంచిదన్నారు. కేన్సర్‌పై అవగాహన, ప్రాథమిక దశలో గుర్తించడం ద్వారా కేన్సర్ మహమ్మారిని దూరంగా తరిమేయవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అరుణ, ఉపాధ్యాయురాలు సోఫియా బేగం పాల్గొన్నారు.

డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి



డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు పన్నీర్‌సెల్వంను సన్మానిస్తున్న దృశ్యం

మదనపల్లె : ప్రభుత్వ వాహన డ్రైవర్ల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని చిత్తూరు జిల్లా డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు పన్నీరు సెల్వం అన్నారు. ఆదివారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో మదనపల్లి డివిజన్ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు పన్నీర్ సెల్వం మాట్లాడుతూ డ్రైవర్లు ఎదుర్కొంటున్న బదిలీల సమస్యపై జిల్లా ఉన్నతాధికారులకు తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తాన్నారు. డ్రైవర్లు రోడ్డు భద్రత జాగ్రత్తలు కచ్చితంగా పాటించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న పాత వెహికల్స్‌కు ఫిట్నెస్ సర్టిఫికెట్లు జారీ చేయాలని కోరారు.అనంతరం జిల్లా అధ్యక్షుడు పన్నీర్ సెల్వంను మదనపల్లి డివిజన్ డ్రైవర్లు ఘనంగా సన్మానించారు. సంఘం అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరించిన డ్రైవర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మదనపల్లి డివిజన్ అధ్యక్షులు నాగరాజు, డ్రైవర్లు కృష్ణారెడ్డి, నాగరాజు, గోవిందరాజులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి మార్గం చూపాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నవ్యాంధ్ర టూవీలర్ వెల్ఫేర్ అసోషియేషన్ సభ్యులు

కలకడ : నిరుద్యోగ యువతకు ఉపాధి మార్గం చూపడానికి మెకానిక్ షెడ్ అనేది ఉపాధి కల్పన కేంద్రంగా ఉండాలని రాష్ట్ర నవ్యాంధ్ర టూవీలర్ వెల్ఫేర్ అసోషియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ సుభాని అన్నారు. ఆదివారం కలకడలో నూతన నవ్యాంధ్ర టూవీలర్ అసోషియేషన్ కమిటీ ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ముందుగా టూవీలర్ మెకానిక్‌లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం షాదీమహల్‌లో కమిటీ సభ్యులు, నూతన మెకానిక్‌లతో కలిసి మాట్లాడారు. అందరూ యూనియన్ ఏర్పాటు చేసుకుని ఐక్యతతో ముందుకు సాగాలని, నష్ట కష్టాలలో సంఘం ఆదుకోవాలని కోరారు. సంఘం సభ్యత్వం చేసుకుని, ప్రతి కూలీకి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలు, బీమా కల్పించాలని, వారి కుటుంబాల సంక్షేమం కోసం సంఘం సభ్యులు కృషి చేయాలన్నారు. పేద కుటుంబాల ఉన్నతికి కృషి చేయాలని కోరారు. విద్యతో పనిలేకుండా ఎలాంటి విద్య లేని వారికి కూడా ఉపాధి అవకాశం కల్పించి, వారిలోని ప్రతిభతో మరో పదిమందికి ఉత్తమ మార్గం చూపాలన్నారు. కార్యక్రమంలో వైఎసాసర్ జిల్లా సంఘం అధ్యక్షులు బహదూర్‌ఖాన్, కలకడ మండలశాఖ అధ్యక్షులు మహమ్మద్‌రఫీ, కార్యదర్శిగా మోహద్దీన్, ట్రెజరర్ హసన్‌బాషా, కమిటీ సభ్యులు మహబూబ్‌బాష, సయ్యద్‌బాష, రియాజ్‌అల్లీ, సద్దాం,తదితరులు పాల్గొన్నారు.


రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ



సంతానం కోసం వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తజన సందోహంతో పోటెత్తింది. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి వేకువజాము నుంచే భక్తుల సందడి మొదలైంది. మహిళలు అమ్మవారి ఎదుట సంతాన కోసం వరపడ్డారు. భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు.

డీఎస్పీ కేశప్పకు అడిషనల్ ఎస్పీగా పదోన్నతి



మదనపల్లె : మదనపల్లె డీఎస్పీ కొర్రపాటి కేశప్పకు అడిషనల్ ఎస్పీగా పదోన్నతి లభించింది. శనివారం రాష్ట్రప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్‌కుమార్ గుప్తా విడుదల చేసిన ఉత్తర్వుల్లో నోషనల్ పదోన్నతిలో భాగంగా అడిషనల్ ఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. 2019-20 ప్యానెల్ సంవత్సరానికి అడిషనల్ ఎస్పీ పదవికి కేశప్పకు అర్హత లభించినప్పటికీ, డిపార్ట్‌మెంటల్ జనరల్ అడ్మినిస్ట్రేషన్‌లో భాగంగా పెండింగ్‌లోని క్రమశిక్షణ చర్యలు ముగిసేంతవరకు పదోన్నతి వాయిదా పడిందన్నారు. పెండింగ్‌లో ఉన్న క్రమశిక్షణ కేసు ఉపసంహరించుకోవడంతో, 2019-20 ప్యానల్ ఇయర్‌లో జూనియర్‌లతో సమానంగా తనకు అడిషనల్ ఎస్పీగా పదోన్నతి కల్పించాలని కేశప్ప అభ్యర్థించడంతో ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఇటీవల డీఎస్పీ కేశప్ప స్థానంలో అనంతపురం అర్బన్ డీఎస్పీగా పనిచేస్తున్న ప్రసాదరెడ్డిని మదనపల్లెకు కేటాయిస్తూ, కేశప్పను హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేసుకోవాల్సిందిగా బదిలీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే, డీఎస్పీ కేశప్ప బాధ్యతల నుంచి రిలీవ్ కాకముందే అడిషనల్ ఎస్పీగా పదోన్నతి లభించింది. అయితే స్థానం మాత్రం కేటాయించలేదు.

విజయమే లక్ష్యంగా పనిచేయాలి

– సమన్వయకర్త నిసార్ అహ్మద్



సింగంవారి పల్లెలో మాట్లాడుతున్న నిసార్ అహ్మద్

నిమ్మనపల్లె : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ ప్రజా ప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు పని చేయాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్ అన్నారు. ఆదివారం మండలంలోని వెంగం వారి పల్లె పంచాయతీ సింగంవారిపల్లిలో పర్యటించారు. స్థానికులైన ఖాజాపీర్, దాదా పీర్ మదనపల్లెలో వ్యాపార రంగంలో స్థిరపడ్డారు. వారి ఆహ్వానం మేరకు నిసార్ అహ్మద్ నాయకులతో కలిసి గ్రామంలో జరిగిన విందు సమావేశంలో పాల్గొన్నారు. మండల నాయకులు కార్యకర్తలు నిసార్ అహ్మద్‌కు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం తాజా రాజకీయ పరిస్థితులపై మండల నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం 99 శాతం హామీలు అమలు చేసి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దేశంలోనే ఆదర్శంగా మారారన్నారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందుతున్నాయన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పార్టీ విజయం సాధించటానికి సభ్యులందరూ వర్గ విభేదాలు లేకుండా ఐక్యమత్యంతో కృషి చేయాలన్నారు. పార్టీని గెలిపించి మరోసారి జగనన్న ముఖ్యమంత్రి చేసుకుంటేనే రాష్ట్రం అభివద్ధి చెందుతుంది అన్నారు. త్వరలోనే పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు , నాయకులు , కార్యకర్తలు , అభిమానులతో కలసి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ పర్యటిస్తామన్నారు. స్థానిక సమస్యలను తెలుసుకొని పరిష్కరించి, పార్టీ విజయానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కే సదాశివరెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు రెడ్డి శేఖర్ రెడ్డి, మదనపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ జింక వెంకటా చలపతి, సీనియర్ నాయకులు గార బురుజు రమణారెడ్డి, వైస్ ఎంపీపీ జయప్రకాష్ రెడ్డి, సర్పంచ్ సుబ్రమణ్యం, వేంగం వారి పల్లె మాజీ సర్పంచ్ నవాజ్ , నాయకులునరేందర్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, దొర, శంకర, తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



పట్టాలను అందిస్తున్న ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం: అర్హతే ప్రామాణికంగా ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికే సాధ్యమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేతులమీదుగా ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ మండలంలో 3458 ఎకరాల డికెటి పట్టాలను సెటిల్‌మెంట్ పట్టాలుగా మార్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. అలాగే 4391 ఎకరాల చుక్కల భూములను క్రమబద్దీకరించి రైతులకు మేలు చేశారన్నారు. అనంతరం 168 మందికి ఇళ్ల పట్టాలను, 65 మందికి ఫ్రీహోల్డ్ పట్టాలను అందించినట్లు తెలిపారు. ప్రతి గడపకూ సంక్షేమాన్ని అందించాలన్నదే సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అజెండా అన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందజేస్తున్నామన్నారు. చక్కని పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మీరంతా అండగా నిలిచి, రానున్న ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. సచివాలయ వ్యవస్థ, రైతుల అభ్యున్నతి కోసం ఆర్బీకేల వ్యవస్థలను ఏర్పాటు చేసి వ్యవసాయాన్ని పండుగ చేశారన్నారు. పేదల ఆరోగ్యం కోసం సీఎం జగన్మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను ప్రవేశపెట్టారన్నారు. ఒక కుటుంబం బాగుంటే రాష్ట్రం, దేశం బాగుంటుందన్నారు. ఆరోగ్యాంధ్ర సాధనే సీఎం జగన్ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఫిరోజ్ ఖాన్, సర్పంచ్ గంగులమ్మ, నాయకులు చింతల ఆనంద రెడ్డి, చింతల శివానంద రెడ్డి, కేశవ రెడ్డి, నీళ్లభాస్కర్, శ్రీధర్‌రాయల్, శంకరాచారి, ఇబ్రహీం, మహబూబ్‌బాషా, వెంకట్రమణ, రఘు, శంకర, లబ్ధిదారులు, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పారదర్శక పాలన

– ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి



మేకలవారిపల్లిలో పర్యటిస్తున్న ఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి

వాల్మీకిపురం: ప్రజల గడప వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో పారదర్శక పాలన అందిస్తోందని ఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చింతపర్తి పంచాయతీ మేకలవారిపల్లిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్థులకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపిస్తే మళ్ళీ సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే వస్తాయన్నారు. ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎంపి మిథున్ రెడ్డిలను అత్యధిక మెజారీతో గెలిపించాలన్నారు. దళారి వ్యవస్థ లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే సంక్షేమం జమ అవుతుందన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలు బయటకు వెళ్లకుండా సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్నారు. ఈ నెల 11వ తేది అనంతపురంలో జరిగే సిద్ధం కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పాల్గొని, సిద్ధం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మినారాయణ రెడ్డి, నల్లంకి నరసింహులు, కిరణ్ కుమార్, చెంగల్ రెడ్డి, శీనా, చిన్నప్ప, శ్రీరాములు, సుధాకర, సత్యనారాయణరెడ్డి, నాగేంద్ర, గంగులప్ప, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సబ్ జూనియర్ హాకీ జట్టు ఎంపిక



హాకీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ నాయకులు

మదనపల్లె సిటీ: స్థానిక బీటీ కాలేజీ హాకీ మైదానంలో ఆదివారం జిల్లా సబ్ జూనియర్ హాకీ జట్టు ఎంపిక చేశారు. జిల్లా నుంచి పలువురు హాకీ క్రీడాకారులు ఎంపికకు హాజరయ్యారు. జిల్లా జట్టుకు 18 మందిని ఎంపిక చేశారు. మరో ఇద్దరు స్టాండ్‌బైలుగా ఎన్నికయ్యారు. ఇందులో గణేష్, భానుప్రకాష్, బాలాజీ, కిరణ్‌కుమార్, వి.యోగవేంద్రరెడ్డి, ఎస్.నజీరుల్లా, పి.జయప్రకాష్, హర్షవర్ధన్, కె.జస్వంత్, టి.సాయిహితేష్, రవితేజ, ధనుష్, ఎస్.హర్షవర్ధన్, పి.నికిలేష్, వి.రవికాంత్, మిథన్‌రెడ్డి, చాణుక్యసాయి, షేక్ మహమ్మద్ జాహీర్, స్టాండ్‌బైలుగా జగన్‌మోహన్‌రెడ్డి, రోహిత్‌లు ఎంపికైనట్లు అన్నమయ్య జిల్లా హాకీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి ప్రసాద్‌రెడ్డి, సీనియర్ పీడీ రాజు, కోచ్ నౌషాద్, మేనేజర్ హరిబాబు, ఫిజియోథెరఫిస్టు వంశీ, పీడీలు జలజ, నరేష్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు కర్నూలులో ఈనెల 10 నుంచి 12 వరకు జరిగే రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

అధికంగా నీరు సేవించడంతోనే ఆరోగ్యం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సనత్‌రెడ్డి

కలకడ : అధికంగా నీరు సేవిచడం వలన ఆరోగ్యంతో పాటు, పొత్తికడుపులో రాళ్ళు చేరడం ఉండదని డాక్టర్ సనత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కలకడ బాటవారిపల్లె ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆద్య ఆసుపత్రి మదనపల్లె వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 134మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ మాట్లాడుతూ కిడ్నీలో రాళ్లు చేరడం అంటే నీటిలోని మట్టి సుద్ద పేరుకుపోవడం, కొన్ని చిన్నచిన్న రాళ్లు పొత్తికడుపులో చేరిన సమయంలో అధిక నొప్పి వస్తుందన్నారు. అందుకు కోత ఆపరేషన్ లేకుండా లిథియం ఫైవర్‌లేజర్ కిరణాలతో తొలగించవచ్చన్నారు. చిన్న జబ్బులకు భయభ్రాంతులకు గురికాకుండా, ముందు జాగ్రత్తలు, వైద్యుల సలహాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పావని రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షులు వెంకట్రమణరెడ్డి, పాఠశాల కమిటీ సభ్యులు వైవి రమణ, భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యపరీక్షలు

కలికిరి: విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని షాదీమహల్‌లో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. విశ్రాంత ఉద్యగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి, మండల గౌరవాధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ ఆధ్వర్యంలో 20 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, కంటి శస్త్ర చికిత్సలు అవసరమైన నలుగురుని ఎంపిక చేశారు. వీరికి తిరుపతిలో ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేయించనున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు.